క్లుప్తంగా

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



నవీపేట/రెంజల్(బోధన్): అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు విధించకుండా కొనుగోలు చేయాలని బీజేపీ బోధన్ నియోజకవర్గ నాయకుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. నవీపేట, రెంజల్ మండలాల్లో తడిసిన ధాన్యాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయా మండలాల బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కోటగిరిలో బీజేపీ ఆందోళన



రుద్రూర్: అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోటగిరిలో శనివారం బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని అందచేశారు. ధాన్యం కాంటాలు పెంచాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాస్, సాయిలు, సూర్యకాంత్, శ్రీధర్, రాజాగౌడ్, సురేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు



బోధన్ రూరల్ (బోధన్): సాలూరలో శనివారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక రథంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఊరేగిస్తూ, మహిళలు హారతులతో తరలి వచ్చారు. ఎస్‌ఐ సందీప్ జెండా ఊపి ఊరేగింపు ప్రారంభించారు. మహారాష్ట్ర కళాకారులు చేసిన లెజీం నృత్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం భజనలు నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



బోధన్: ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 132వ రోజు కొనసాగాయి. దీక్షలో న్యాయవాది శంకర్, స్థానిక యువకుడు నాగరాజు కూర్చున్నారు. న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి


నవీపేట: అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వీర్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవో నంబర్ 58, 59 ప్రకారం ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మూడోసారి గడువును పొడిగించిందని, అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మోకాళ్లపై నిలబడి వీవోఏల నిరసన



రుద్రూర్: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శనివారం రుద్రూర్, కోటగిరి మండల కేంద్రాల్లో ఐకేపీ వీవోఏలు శనివారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. తమకు రూ. 18 వేల వేతనం ఇవ్వాలని, అర్హత కలిగిన వారికి సీసీలుగా ప్రమోషన్‌లు ఇవ్వాలని వారు నినాదాలు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



రెంజల్(బోధన్): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్సై సాయన్న సూచించారు. మండలంలోని సాటాపూర్‌లో శనివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాలతో పాటు ఆర్‌టీఏ నిబంధనలపై, షీటీం, ర్యాగింగ్, లైంగిక వేధింపులు, పేకాట, బెట్టింగ్ వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు.

గురుకులాల్లో సమ్మర్ క్యాంప్స్

- విద్యార్థినీవిద్యార్థుల నూతన ఆవిష్కరణలకు మూలం
- ఆర్మూర్ గురుకులంలో ప్రారంభమైన శిబిరం



ఆర్మూర్‌లోని శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ఆర్మూర్‌టౌన్: ప్రతిభగల విద్యార్థులకు మరింత పదునుపెట్టి ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దాడానికి సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల్లో 'స్పార్కల్స్' పేరుతో ప్రత్యేక వేసవి శిబిరాలను నిర్వహిస్తోంది. వేసవి సెలవులు ఇచ్చినా, ఇంటికి వెళ్లకుండా నైపుణ్యాలను పెంచుకోవాలనే తపన, ఆసక్తి ఉన్న విద్యార్థులను ఎంపిక చేసుకుని శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో ఆర్మూర్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈనెల 22న శిబిరాన్ని ప్రారంభించారు. పాఠశాలలో 15రోజుల పాటు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎంపిక చేసిన విద్యార్థులకు నైపుణ్యాలు, జ్ఞానం, వికాసం, నాయకత్వ లక్షణాల అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ప్రత్యేక అంశాలపై అవగాహన..

నిజామాబాద్ జిల్లా ఆర్‌సీవో మేరి ఏసుపాదం ఆధ్వర్యంలో ఇందల్వాయి ఏకలవ్య పాఠశాల నుంచి 12మంది, గాంధారి ఏకలవ్య నుంచి13, చిమన్‌పల్లి ట్రైబల్ నుంచి 55 మంది, బోధన్ సోషల్ వెల్ఫేర్ నుంచి 40 మంది, వేల్పూర్ సోషల్ వెల్ఫేర్ నుంచి 40మంది ఆర్మూర్ సోషల్ వెల్ఫేర్ నుంచి 40మంది మొత్తం 200మంది విద్యార్థులు 'స్పార్కల్స్' క్యాంపులో పాల్గొంటున్నారు. శిబిరాల్లో బేసిక్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపడటం, డ్రోన్ తయారీ, ఉపయోగాలు, సైన్స్ ప్రయోగాశాల, డిసరింట్ స్ట్రోక్స్ ద్వారా లక్ష్యాలను ఎలా ఎంచుకోవాలనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

విజ్ఞానాన్ని అందిస్తున్నారు..



వేసవి ప్రత్యేక శిబిరంలో విభిన్న అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా పాఠ్యాంశాలలో లేని విజ్ఞానాన్ని సైతం అందజేస్తున్నారు. పోటీ ప్రపంచంలో లక్ష్యాలను చేరుకునే విధంగా నైపుణ్యాలను నేర్పిస్తున్నారు.

–జశ్వంత్, పదో తరగతి, గురుకుల పాఠశాల, ఆర్మూర్

నైపుణ్యం పెంచుకోవాలి..



వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు శిక్షణ శిబిరంలో నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ప్రస్తుత తరంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి శిబిరంలో నేర్పించే అంశాలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి.

–దుర్గారెడ్డి, ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల, ఆర్మూర్

సద్వినియోగం చేసుకోవాలి..



స్పార్కల్స్ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. శిబిరంలో నేర్పించే వివిధ అంశాలపై పట్టు సాధించి ఉన్నత భవిష్యత్తును ఎంచుకోవాలి. విద్యార్థులు ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి.

–మేరి ఏసుపాదం, ఆర్‌సీవో, నిజామాబాద్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి





ఫత్తేపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు.. నూత్‌పల్లిలో

పెర్కిట్(ఆర్మూర్)/ఆర్మూర్‌టౌన్ : వర్ష సూచన కారణంగా ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని నిర్వాహకులను తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్ ఆదేశించారు. ఆర్మూర్ మండలం పిప్రి, ఫత్తేపూర్ గ్రామాలతో పాటు పట్టణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వినోద్, టీఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు, సెంటర్ ఇన్‌చార్జి నీలిమా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల పరిధిలోని నూత్‌పల్లి, అన్నారం, సిర్పూర్‌లో గల వరి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ రవీందర్ శనివారం పరిశీలించారు. కొనుగోళ్లు వేగవంతం చేయాలని, తూకం వేసిన బస్తాలను వెంటనే మిల్లులకు రవాణా చేయాలని నిర్వాహకులను ఆదేశించారు.



భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్: మండలకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, ఏడీఏ మల్లయ్య పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే తెలియజేయాలని రైతులకు వారు సూచించారు. ఏవో సాయికృష్ణ, ఏఈఓ లక్‌పతి ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని సొసైటీలు, ఏఎంసీలో వరి ధాన్యం కొనుగోళ్లపై తహసీల్దార్, సీఈవోలు, సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వరప్రసాద్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు తరలింపు, తరుగు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ వరప్రసాద్

మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి





వర్నిలో మాట్లాడుతున్న సీఐటీయూ ప్రతినిధులు.. రుద్రూర్‌లో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ సభ్యులు

వర్ని: మేడే అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని వారం రోజులపాటు కార్మికులు, కర్షకులు, కష్టజీవులు ఘనంగా నిర్వహించి, జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడే కష్టజీవుల పండుగ అని ప్రతి గ్రామంలో ఎర్రజెండాలు ఎగురవేసి మేడే పోరాట స్ఫూర్తిని చాటాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, గంగాధర్, రాజు, వెంకటరమణమ్మ, సత్యవ్వ, వరలక్ష్మి, మేఘన పాల్గొన్నారు.

రుద్రూర్: మండలంలో శనివారం మేడే వాల్ పోస్టర్లను ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ కార్మికవర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను నేటి పాలకులు అమలు చేయకుండా, రద్దు చేయడం దుర్మార్గ చర్యని మండిపడ్డారు. మేడేను ఘనంగా జరుపుకోవాలన్నారు.

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి







ఆర్మూర్‌లో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు.. మాక్లూర్‌లో.. కోటగిరిలో..

పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్/రుద్రూర్/బోధన్‌రూరల్/రెంజల్/నవీపేట/ఎడపల్లి/భీమ్‌గల్: ప్రభుత్వం వెంటనే తమను క్రమబద్ధీకరించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని మండలకేంద్రాల్లో శనివారం సమ్మె ప్రారంభించారు. ఈసందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగు సంవత్సరాల ప్రొబేషనర్ కాలాన్ని పూర్తి చేసుకున్న తమను క్రమబద్ధీకరించాలన్నారు. అలాగే సీనియర్ అసిస్టెంట్లకు వర్తించే పేస్కేలును అమలు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న జేపీఎస్‌లను సైతం రెగ్యులరైజ్ చేయాలన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని పేర్కొన్నారు.



భీమ్‌గల్‌లో..



నవీపేటలో..



రెంజల్‌లో..

బస్టాండ్ చుట్టూ దుకాణాలు పెట్టొద్దు

బోధన్: పట్టణంలోని పాత బస్టాండ్ చుట్టూ ఎలాంటి వ్యాపార దుకాణాలు పెట్టుకోవద్దని మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్ శనివారం తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ అధికారులకు కట్టడి చర్యల కోసం లిఖిత పూర్వకంగా సమాచారం ఇచ్చామన్నారు. అలాగే ఆర్టీసీ డిపో మేనేజర్ టీఎస్‌స్వామి బస్టాండ్‌ను సందర్శించారు. ఆదివారం నుంచి బస్టాండ్ మీదుగా బస్సులు నడిపేందుకు ట్రయల్ రన్ నిర్వహిస్తామని డీఎం తెలిపారు. ఏళ్లుగా బస్టాండ్ చుట్టూ పండ్ల దుకాణాలు ఉండటం వల్ల ప్రజల రోడ్డుపైనే నిలబడి బస్సులు, ఇతర వాహనాల్లో వెళ్లేవారు. ప్రస్తుతం దుకాణాలను తొలగించడం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తీరనున్నాయి.

ఆధ్యాత్మికం..

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

నవీపేట: మండల కేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయంలో ఆదివారం పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు భూమాచారి, సంజీవ్‌కుమార్, కృష్ణలు ఒక ప్రకటనలో తెలిపారు. సజీవ సమాధి రోజున నిర్వహించే ఆరాధన ఉత్సవాలలో ప్రత్యేక పూజలు చేస్తామని, అన్నదానం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఆలయ వార్షికోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



బోధన్: పట్టణంలోని లక్ష్మిగోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షికోత్సవ వేడుకలు మే 6నుంచి 11వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈమేరకు శనివారం వేడుకల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు.

వైభవంగా అఖండ శివనామ సప్తాహం

బోధన్: సాలూరలోని రాచన్న మందిరం వద్ద



వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నాల్గవ అఖండ శివనామ సప్తాహం వైభవంగా కొనసాగుతోంది. శనివారం శివకీర్తన, భజనలు, పరమ రహస్య గ్రంథపారాయణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సిద్ధుల గుట్ట మహిమాన్వితమైనది



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్ట మహిమాన్వితమైన ఆధ్యాత్మిక క్షేత్రమని హిమాలయ యోగి సంతు సదానంద యోగి మహరాజ్ అన్నారు. సిద్ధుల గుట్టపై ఏర్పాటు చేసిన నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం వద్ద శనివారం ధ్యానాత్మ జ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, ధ్యానులకు ఆత్మజ్ఞానాన్ని అందజేశారు. మంగిరాములు మహారాజ్, తేలు లక్ష్మీనర్సయ్య, పీఎస్ఎస్‌సీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్లగంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రారంభమైన శ్రీరామ మహాయజ్ఞం



రెంజల్(బోధన్): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలోని శ్రీ సీతారాం ధాం సంత్ సేవాశ్రమంలో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, పంచకుండాత్మక శ్రీరామ మహాయజ్ఞం కార్యక్రమాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశపూజతో పాటు మొదటి రోజు గ్రామంలోని దేవతామూర్తులకు అభిషేకాలు నిర్వహించారు.

12 రకాల సరుకులు అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నందిపేట్(ఆర్మూర్): రేషన్ దుకాణాల ద్వారా 12 రకాల నిత్యవసర వస్తువులను ఉచితంగా అందజేయాలని ప్రగతిశీల మహిళా సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సభ్యులు లత, లావణ్య, గంగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్ : రేషన్ షాపుల ద్వారా పేదలకు 12రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని పీవైఎల్ మండల కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పీవోడబ్ల్యూ, పీవైఎల్ సంఘాల నాయకులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రతిరేషన్ షాపులో 11కేజీల బియ్యం, 12 రకాల సరుకులు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో పోరాటం తీవ్రతరం చేస్తామన్నారు. సభ్యులు లక్ష్మీ, పద్మ, రోషిత్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో అవకతవకలు లేకుండా చూడాలి

కమ్మర్‌పల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు లేకుండా చూడాలని బీజేపీ బాల్కొండ నియోజకవర్గ నేత డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఇనాయత్‌నగర్ వరి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. క్వింటాల్ ధాన్యంకు 5కిలోల వరకు కడ్తా తీస్తున్నారని, నిజామాబాద్ రైస్‌మిల్‌లో 3కిలోల కడ్తా తీసుకుంటామని, లేకపోతే ధాన్యం కొనుగోలు చేయమని బెదిరిస్తున్నారని రైతులు మల్లికార్జున్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన ఎంపీ అర్వింద్‌కు ఫోన్ చేసి విషయాన్ని వివరించారు. ఈ అవకతవకలపై కలెక్టర్‌కు వివరించి న్యాయం చేస్తామని ఎంపీ వెల్లడించినట్లు మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. బీజేపీ మండలాధ్యక్షుడు సంజీవ్, నాయకులు భూమారెడ్డి, రవి, ప్రశాంత్, శ్రీనివాస్ ఉన్నారు.

మార్పు కోసమే కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం

బోధన్: నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల్లో మార్పు తీసుకొచ్చేందుకు కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని సిక్కుల కాలనీలో టౌన్ సీఐ ప్రేమ్‌కుమార్ అధ్వర్యంలో ఆయన శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీవాసులతో నిర్వహించిన అవగాహన సమావేశం లో ఏసీపీ మాట్లాడారు. అనంతరం కాలనీల్లో తనిఖీలు చేపట్టారు. ధ్రువపత్రాలు లేని నాలుగు బైక్ లను సీజ్ చేశామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోధన్‌రూరల్(బోధన్): జిల్లా కేంద్రంలోని అర్సపల్లి బైపాస్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని ఊట్‌పల్లికి చెందిన దియావత్ శ్యామ్, యశ్వంత్, రత్నావత్ ప్రశాంత్, రుదావత్ రేఖ మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను శనివారం ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గంగారెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ కవితల దృష్టికి తీసుకెళ్లి మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు సాయం అందేలా చూస్తామని తెలిపారు.

సంక్షిప్తం

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నందిపేట్: మండలంలోని వెల్మల్ గ్రామంలో శనివారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీపీ పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను శనివారం ఎంపీపీ వాకిడి సంతోష్ పంపిణీ చేశారు. సర్పంచులు లోక సత్తెవ్వ, చాయ చందు, ఉప సర్పంచ్ రవి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రెండో వార్డులో పలు బాధిత కుటుంబాలకు శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కౌన్సిలర్ ఖాందేష్ సంగీత అందజేశారు. నాయకులు ఖాందేష్ సత్యం, మునిర్, నరేశ్, సాయినాథ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌కు సన్మానం

నందిపేట్: మండలంలోని అయిలాపూర్ యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ మాధవికి ప్రమోషన్ రావడంతో బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శనివారం ఆమెకు వీడ్కోలు సమావేశం నిర్వహించి, సన్మానించారు. సర్పంచులు సాయరెడ్డి, సుబ్బారావు, నాయకులు సుదర్శన్, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

నియామకం..



మాక్లూర్: మండలంలోని ఒడ్డెట్‌పల్లికి చెందిన దుద్దు గంగాధర్‌ను ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఉత్తర్వులు అందించినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ శనివారం తెలిపారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో భువనగిరి జిల్లా ఆలేరులో జరిగిన మహాసభలో ఆయనను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కూలిన చెట్టుతో ఇబ్బందులు



నవీపేట: నవీపేట శివారులోని బాసర రహదారి పక్కన నేలవాలిన చెట్టుతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వీచిన ఈదురు గాలులు.. కురిసిన అకాల వర్షాలకు బాసర రహదారి పక్కన చెట్టు నేలకొరకగా, పక్కకు వేశారు. కానీ పూర్తిగా తొలగించలేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.